RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 235 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 28 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# ఆర్థిక కష్టాలున్నా.. ఆరు గ్యారంటీల అమలు

## 'మహాలక్ష్మి', 'గృహ జ్యోతి' పథకాల ప్రారంభం



### మహాలక్ష్మి కింద రూ.500కే గ్యాస్ సిలిండర్

### గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్

హైదరాబాద్ : కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను నమ్మే ప్రజలు తమకు అధికారం ఇచ్చారని.. అందుకే ఆర్థిక ఇబ్బందులున్నా చిత్తశుద్ధితో ఒక్కో పథకం అమలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ సచివాలయంలో అభయహస్తం గ్యారెంటీల అమలులో భాగంగా.. 'మహాలక్ష్మి పథకం' 'గృహ జ్యోతి' పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన పథకం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని.. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామని సీఎం రేవంత్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూటికి నూరు శాతం అన్ని హామీలను అమలు చేస్తామని.. తెలంగాణ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అన్నారాయన. అలాగే.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లకే ఈ పథకాలు వర్తిస్తాయని మరోసారి స్పష్టత ఇచ్చారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ఇస్తున్నామని, అలాగే మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీతో రూ.500 సిలిండర్ అందిస్తున్నామని అన్నారు.

**ఎమ్మెల్సీ కోడ్ వల్లే..** ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తుక్కుగుడలో సోనియా గాంధీ హామీ ఇచ్చారు. సోనియా గాంధీ హామీ మేరకు కాంగ్రెస్ కు ప్రజలు పట్టం కట్టారు. రెండు పథకాలను చేవెళ్ళలో ప్రారంభించాలి అనుకున్నాం. ఎమ్మెల్సీ కోడ్ వల్ల అక్కడి నుంచి సెక్రటేరియట్ కు మార్చాల్సి వచ్చింది. ప్రియాంక గాంధీ కోడ్ కారణంగా రద్దు చేసుకున్నారు. కట్టెలపొయ్యి నుంచి గ్యాస్ సిలిండర్ ను ఆనాడే తక్కువకు ఇందిరా గాంధీ ఇచ్చారు. యూపీఏ హయాంలో కాంగ్రెస్ దీపం పథకం తీసుకొచ్చింది. రూ.400 కేగ్యాస్ సిలిండర్ అందించింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1200కు సిలిండర్ రేటు పెరిగింది. మోదీ గ్యాస్ ధరలు పెంచితే కేసీఆర్ సబ్సీడీ ఇవ్వలేదు.

**మా ప్రభుత్వం నిబద్ధతతో ఉంది..** ఎట్టి పరిస్థితుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం. ఎవరు ఎలాంటి శాపాలు పెట్టినా...అపోహలు ప్రచారం చేసినా పథకాలు ఆగవు. సోనియా గాంధీ హామీ ఇస్తే శిలాశాసనం. ఆమె ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేస్తుంది ఈ ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలాగా పాలన చేస్తాం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటాం అని సీఎం అన్నారు.

**ఉచిత విద్యుత్‌పై ఆ ప్రచారం నమ్మొద్దు: డిప్యూటీ సీఎం భట్టి –** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల స్కీమ్‌ను దేశం అంతా చూస్తోందని.. ఇదొక విప్లవాత్మకమైన ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. "అమలుకాని ఆరు గ్యారెంటీల హామీ కాంగ్రెస్ ఇచ్చినట్లు BRS మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండో రోజు నుంచే విమర్శలు చేస్తోంది. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు జేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆరు గ్యారెంటీ లను అమలు చేయాలని అందరం పట్టుదలతో ఉన్నాం. అరకొర నిధులతో జీతాలు ఇస్తూనే, పథకాలు అమలు చేస్తున్నాం. ఇప్పుడు ప్రారంభించిన గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలువబోతున్నాయి. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించడమే ఇందిరమ్మ రాజ్యం అంటే. 200 యూనిట్లు అమలు అంటే కోతలు అని ప్రచారం చేస్తున్నారు. 200 యూనిట్ల వరకు రేపు మార్చి నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా కరెంట్ ఇవ్వబోతున్నాం. అర్హత కలిగిన వారందరికీ ఉచిత 200 యూనిట్ల విద్యుత్ ఇస్తాం. బీఆర్ఎస్ నేతలు బోగస్ ప్రచారం చేస్తున్నారు.. వాటిని నమ్మొద్దు అని భట్టి పిలుపు ఇచ్చారు.

**ఇతర మంత్రులు..** భవిష్యత్తులో తెల్లకార్డు ఉండి ఎల్పీజీ కనెక్షన్ ఉంటే.. మహాలక్ష్మి పథకం వర్తింపజేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం సుమారు 40 లక్షల మంది బల్దిదారులున్నారని.. లబ్ధిదారుల జాబితాలో ఇప్పుడు లేనివారిని త్వరలోనే చేరుస్తామని చెప్పారాయన. మరో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొలువుదీరాక రెండు పథకాలు..

ఇప్పుడు మరో రెండింటిని ప్రారంభించామని.. నూటికి నూరు శాతం అన్ని పథకాలు అమలు చేస్తామని అన్నారు.

## మార్చి 1 నుంచి భారాస చలో మేడిగడ్డ : కేటీఆర్




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు.. మార్చి 1 నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమం చేపట్టనునట్లు మాజీ మంత్రి, భారాస నేత కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. "కాంగ్రెస్ గతంలో చేపట్టింది జలయజ్ఞం కాదు.. ధనయజ్ఞం. కేంద్రం, ఏపీ, మహారాష్ట్రలోనూ ఆ పార్టీ గతంలో అధికారంలో ఉన్నా ప్రాజెక్టుల కోసం అనుమతులు తీసుకురాలేదు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్ర జలసంఘం చెప్పింది. అక్కడి కంటే మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఎక్కువ. అందుకే కాళేశ్వరం ప్రారంభించాం. ఈ ప్రాజెక్టు కోసం మహారాష్ట్రతో ఉన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాం. కాళేశ్వరం అంటే ఒక బ్యారేజీ కాదు.. 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌజ్‌లు, 201 కిలోమీటర్ల సొరంగాలు. 88 మీటర్ల నుంచి 618 మీటర్లకు నీటిని లిఫ్ట్ చేశాం. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించాం. కాళేశ్వరం జలాలతో వాగులు, చెరువులనూ నింపాం. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. కాళేశ్వరం వల్ల పాతాళగంగ పైకి వచ్చింది" "మేడిగడ్డలో 84 పిల్లర్లు ఉంటే 3 కుంగిపోయాయి. బ్యారేజీ మొత్తం కొట్టుకుపోయినట్లు ప్రచారం చేస్తున్నారు. గతంలో ఫరక్కా బ్యారేజీలోనూ ఇలా జరిగింది. 1957లో కడెం ప్రాజెక్టే కొట్టుకుపోయింది. ప్రకాశం, ధవళేశ్వరం బ్యారేజీల్లోనూ సమస్యలు వచ్చాయి. కాఫర్ డ్యామ్ కట్టి మేడిగడ్డకు మరమ్మతులు చేయవచ్చు. 2 నెలల్లో మేడిగడ్డకు మరమ్మతులు చేసి నీళ్లు ఇవ్వవచ్చు. సీఎం తీరు చూస్తే కాళేశ్వరంపై కుట్ర చేస్తున్నారని అనిపిస్తుంది. మార్చి 1 నుంచి భారాస చలో మేడిగడ్డ కార్యక్రమం చేపట్టనుంది. 150 నుంచి 200 మంది పార్టీ ప్రతినిధులతో అక్కడికి వెళ్తున్నాం. తెలంగాణ భవన్ నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగా తొలి రోజు కాళేశ్వరం వెళ్తాం. ఈ ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు చూపెట్టి.. వాస్తవాలు తెలియజేస్తాం" అని కేటీఆర్ వివరించారు.

## నన్ను అనవసరంగా గెలుకుతున్నారు..

### జాగ్రత్త అంటూ బండి ఫైర్




సిద్దిపేట: అయోధ్య రాముడి విషయంలో కాంగ్రెస్ నేతలపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని బీజేపీ ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాహిత యాత్రలో ఎంపీ మాట్లాడుతూ.. "అయోధ్యలో రాముడు జన్మించినట్లు గ్యారెంటీ ఏంటని మీరు ప్రశ్నిస్తే, నేను నా తల్లికి పుట్టినట్టు గ్యారెంటీ ఏంటి అంటే నువ్వెందుకు మీదేసుకుంటున్నావు. నన్ను అనవసరంగా గెలుకుతున్నారు, నేను శాంతియుతంగా ప్రజాహిత యాత్ర చేపడితే మీకేం వచ్చింది. ఎక్కడ నేను ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ విసురుతున్న.. నేను నా విశ్వాసాలతో రాముడు పేరిట ఎన్నికల్లో నిలుచుంటా, నువ్వు నీ వాదనతో నీ అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వ్యాపారం చేసుకుని బతుకుతా, మళ్ళీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. ఒకవేళ నువ్వు ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా? పొన్నంతో రేవంత్ రెడ్డి జాగ్రత్తగా ఉండాలి. మొదటి నుంచి రేవంత్ రెడ్డిని వ్యతిరేకించిన వారిలో పొన్నం ఉన్నారు. ఇలాంటి అలజడులలో రేవంత్‌ను ఇరికించి ఆయన పదవి కిందకి నీళ్ళు తేవచ్చు. బీఆర్ఎస్‌లో కేటీఆర్, కాంగ్రెస్‌లో పొన్నంలు మోపైండ్లు. కేటీఆర్ వాగుడుతో బీఆర్ఎస్ మునిగింది.. పొన్నంతో కాంగ్రెస్ మునగడం ఖాయం" అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

# నేనంటే అల్లాటప్పా అనుకోవద్దు..

## కేటీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్



చేవెళ్ల: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్లలో నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన మాట్లాడారు. "రేవంత్ పేరు చెబితే.. 3 సీట్లు కూడా వచ్చేవి కావని కేటీఆర్ చెప్పారు. ఆయనకు చేవెళ్ల సభ నుంచి సవాల్ విసురుతున్నా. దమ్ముంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఒక్క సీటయినా గెలిపించి చూపించాలి. రేవంత్‌రెడ్డి అంటే అల్లాటప్పా అనుకోవద్దు. తండ్రి పేరు చెప్పి పదవిలో కూర్చున్న వ్యక్తిని కాదు. కార్యకర్త స్థాయి నుంచి సీఎం స్థాయికి ఎదిగాను. చంచల్‌గూడ జైలులో పెట్టినా.. లొంగిపోకుండా పోరాడాను. నల్లమల అడవుల నుంచి దుర్మార్గులు, అవినీతిపరులను తొక్కుకుంటూ వచ్చాను. కార్యకర్తల అండ ఉన్నంతకాలం నా కుర్చీని ఎవరూ తాకలేరు" అని స్పష్టం చేశారు.

**ఇందిరమ్మ కమిటీలను పునరుద్ధరిస్తాం :** గత ప్రభుత్వంలో అణచివేతకు గురికాని వర్గమంటూ లేదని రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తల శ్రమ, రక్తం ఉందని.. వాళ్ల రుణం తీర్చుకుంటామని తెలిపారు. ఎంపీలను గెలిపించడంతోనే తమ బాధ్యత తీరిపోదని, పార్టీ జెండా మోసిన వారికి న్యాయం చేస్తామని వెల్లడించారు. "ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైంది? కేడీ.. మోదీ కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు. ఇద్దరూ కలిసి కాంగ్రెస్‌ను దెబ్బకొట్టేందుకు నాటకాలు ఆడుతున్నారు. త్వరలో మెగా డీఎస్సీ వేసి భారీ స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేస్తాం. మళ్లీ ఇందిరమ్మ కమిటీలను పునరుద్ధరిస్తాం. కాంగ్రెస్ అభయహస్తం హామీలను ఇంటింటికీ కార్యకర్తలు తీసుకెళ్లాలి" అని దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారు: భట్టి**

"మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారు. రాష్ట్ర ప్రజలపై కేసీఆర్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పుల భారం మోపింది. గత ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి ఈ ప్రాంతానికి నీరు రాకుండా చేసింది. తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిన ప్రాజెక్టును నిపుణులు, ఇంజినీర్లు వద్దంటున్నా.. మేడిగడ్డ వద్ద కట్టారు. రూ.లక్ష కోట్ల నిధులు గోదావరిలో పోసి వృథా చేశారు"

**– డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఉద్యోగాల కోతకు ముగింపు ఎప్పుడు?

2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా చర్చించిన టాపిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. దీనిని AI అని షార్ట్ ఫామ్‌లో పిలుస్తున్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఉద్యోగాల కోతకు కారణమైంది. చాలా కార్పొరేట్ దిగ్గజాలు తమ సంస్థల నుంచి ఉద్యోగులను తగ్గించుకునే వ్యూహాన్ని అనుసరించడానికి కారణం ఏఐ సాంకేతికతతో వచ్చిన ముప్పుగా అభివర్ణించారు. సాంకేతిక విప్లవంలో వందలాది ఉద్యోగులను ఇంటికి పంపించేసిన కంపెనీల్లో సిస్కో, యుపిఎస్, గూగుల్, స్నాప్, అమెజాన్ సహా వందలాది సంస్థలు ఉన్నాయి. అయితే సడెన్ గా ఇలా ఉద్యోగాల కోత దేనికి? అంటే.. కరోనా క్రైసిస్ సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను చేర్చుకోవడం.. మార్కెట్లో మారిన పరిస్థితులు కొనుగోలుదారుల్లో కొనుగోలు శక్తి తగ్గిపోవడం వంటి విభిన్న కారణాలున్నాయని కొందరు నిపుణులు విశ్లేషించారు. అలాగే పెరిగిన ఏఐ సాంకేతికతతో ఖర్చు తగ్గించుకోవాలనుకోవడం ఉద్యోగాల కోతకు కారణం. ఆదాయం తగ్గడం, ఉత్పత్తి అమ్మకాల ఖరీదును తగ్గించే వ్యూహం కూడా ఉద్యోగాల కోతకు ఒక కారణమయ్యాయని విశ్లేషించారు. అదే సమయంలో ఏఐతో పని చేయగలిగే స్కిల్ ఉన్న ఉద్యోగులకు ఇది పెద్ద వరంగాను మారింది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోయినా ఇందులో కూడా పాజిటివ్ ట్రెండ్ ఉంది. కంపెనీలు ఏఐతో అప్ గ్రేడ్ అయిన ఉద్యోగులను ఎంపిక చేసుకోవడం కొనసాగింది. ఒక పాపులర్ పార్సిల్ సర్వీస్ కంపెనీ, తమ కంపెనీ లాభాల్లో ఉన్నా కానీ, ఖర్చును తగ్గించుకోవాలనుకుంది. పార్సిల్ ని తక్కువ రేటులోనే వినియోగదారుడికి ఇవ్వాలనే ధృక్పథంతో కూడా ఉద్యోగులను తగ్గించుకోవాలని భావించింది. కంపెనీలు రకరకాల కారణాలతో ఇప్పుడు ఉద్యోగులను తొలగిస్తున్నాయని ఒకరు విశ్లేసించారు. అలాగే ఈ పరిస్థితి కొంతకాలం పాటు సర్దుబాటు దిశగా కొనసాగుతోందని అర్థం చేసుకోవాలని విశ్లేషించారు నిపుణులు. మరోవైపు ఉద్యోగాల కోతలను పరిశీలించాక బ్యాంకులు తీసుకున్న ఒక కొత్త నిర్ణయం చాలా ప్రయోజనకరంగా మారింది. ఇండియా, అమెరికాలో వడ్డీ రేట్లు పెంచకుండా తగ్గించడం అనేది ప్రధానంగా కలిసొచ్చేదిగా మారింది. దేశంలోని కొనుగోలు దారుల కొనుగోళు పెంచేందుకు బ్యాంకులు మంచి నిర్ణయం తీసుకుంటున్నాయి. హోమ్ లోన్స్ లేదా ఇతర లోన్లను సులువుగా ఇవ్వాలని నిర్ణయించాయి. ఇది కంపెనీలకు బూస్ట్ ఇస్తుంది. ఉద్యోగాల కోతకు ఎండ్ పలికేదెప్పుడు? అంటే.. ఏఐ టెక్నాలజీని వేగంగా నేర్చుకోవడం దీనికి చాలా వరకూ సొల్యూషన్.. ఉద్యోగుల్లో ఎఫిషియెన్సీ ప్రొడక్టివిటీని పెంచుతుంది. ఏఐ టూల్స్ నేర్చుకోవడం దీనికి పరిష్కారం. కంపెనీలు ఏఐ నేర్చుకునే వారికి ప్రాధాన్యతనిస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. 2023తో పోలిస్తే 2024లో ఉద్యోగాల తొలగింపు శాతం తగ్గుతుందని గూగుల్ సీఈవో అనడం కొంత ఊరట.

**ఇండియాకు ఆ రకంగా ప్లస్:** కంపెనీలు ఉద్యోగులను తొలగించుకోవడం ఒక మార్గం అనుకుంటే, తక్కువ ఖర్చుతో ఉద్యోగులు ఎక్కడ లభిస్తారు? అని వెతకడం మరో ఎత్తుగడ. పెద్ద జీతాలు అందుకునే వారి జాబితాను రెడీ చేయాలని మేనేజర్లు, టీమ్ లీడ్ లపై బాస్ ల నుంచి ఒత్తిడి ఉంటుంది. టీమ్ లీడ్ ఉద్యోగుల పేర్లతో జాబితాను రాస్తారు. ముందుగా రిమోట్ వర్కర్స్ ని తొలగించడం.. లేదా వర్కర్ల పని దినాలను తగ్గించి, ఖర్చును తగ్గించుకునే ప్రయత్నం కొన్ని సంస్థలు చేస్తున్నాయి. అమెరికాలో వర్క్ ఫ్రం హోమ్ చేసేవాళ్ల కంటే భారత్ వంటి నైపుణ్యం ఉన్న దేశాల నుంచి ఔట్ సోర్సింగ్ ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని చూసే కంపెనీలు ఉన్నాయి. ఇది ఒక రకంగా భారతీయ నిరుద్యోగులకు కలిసొచ్చే అంశమని కూడా విశ్లేషించారు. నిజానికి కరోనా క్రైసిస్ తొలగిపోయిన తర్వాత ఉద్యోగాల కోత ఆశ్చర్యపరిచింది. మారుతున్న సాంకేతికతతో ముప్పు పొంచి ఉందని, స్కిల్ ని మెరుగు పరుచుకోవడం అప్ గ్రేడ్ అవ్వడం చాలా ముఖ్యమని ఈ ఉత్పన్నం నేర్పించింది. మనుషులపై AI – మెషీన్ల దాడిని జాగ్రత్తగా అర్థం చేసుకోవాల్సిన తరుణమిది.. దాడికి ప్రతిదాడి కేవలం నైపుణ్యం పెంచుకోవడం మాత్రమే. నిరుద్యోగు లూ.. కెరీర్ విషయంలో తస్మాత్ జాగ్రత్త!

## డిప్యుటేషన్ల రద్దు.. వైద్య సేవలు కరవు!



మహబూబాబాద్ : అత్యవసర వైద్య సేవలను అందించాల్సిన సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ) సిబ్బంది కొరతతో అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఎల్లవేళలా సేవలందించాల్సిన వైద్యులు, సిబ్బంది లేక రోగులకు పాట్లు తప్పడం లేదు. జిల్లాలోని గూడూరు, గార్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఇటీవల ప్రభుత్వం వైద్యశాఖలో డిప్యూటేషన్లను రద్దు చేసింది. దీంతో ఆయా ఆరోగ్యకేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణులు, స్టాఫ్‌నర్స్‌లు, ఇతర విభాగాల సిబ్బంది వారి పూర్వస్థానాల్లోకి వెళ్లారు. ఆ రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా రోజూ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. గూడూరులోని 30 పడకలు, గార్లలో 30 పడకలు ఏర్పాటు చేశారు. అదనంగా ఒక్కో కేంద్రంలో మరో 20 పడకలను అందుబాటులో ఉంచి రోగులకు వైద్య చికిత్స అందిస్తున్నారు. డిప్యుటేషన్ రద్దు చేయడం వల్ల మళ్లీ ఈ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఏర్పడింది. మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. ఇప్పటికే పూర్తి స్థాయిలో ఖాళీలు భర్తీ కాకపోవడంతో తక్షణ అవసరాల మేరకు వివిధ ఆసుపత్రుల నుంచి వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లను డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. దీంతో కొన్నాళ్లుగా పెద్దగా వైద్యసేవల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. తాజాగా డిప్యూటేషన్ల రద్దుతో సమస్య మళ్లీ మొదటికీ వచ్చిందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో వైద్యులు, ఇతర సిబ్బందిని భర్తీ చేసేంతవరకు అవసరం ఉన్నచోట ఆ డిప్యుటేషన్లను కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 16 మంది వైద్యులకు పూర్తి స్థాయిలో నలుగుర్ని నియమించారు. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ముగ్గురు వైద్యులను డిప్యుటేషన్ విధానంలో నియమించారు. వారి సేవలందిస్తున్న క్రమంలో ప్రభుత్వ ప్రకటనతో తిరిగి వారు తమ స్థానానికి వెళ్లారు. ఆరుగురు స్టాఫ్ నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్, థియేటర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ కూడా రద్దు చేశారు. దీంతో వారు కూడా తమ పూర్వ ఆసుపత్రుల్లోకి వెళ్లిపోయారు.

గార్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో 11 మంది వైద్యులు ఉండగా డిప్యుటేషన్‌పై వచ్చిన 10 మంది వైద్య నిపుణులను తిరిగి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపించారు. 18 మంది స్టాఫ్‌నర్స్‌ల్లో 16 మందిని కూడా తిరిగి వారి విధుల్లోకి తీసుకున్నారు. దీంతో 24 గంటలు వైద్య సేవలు అందించే ఈ ఆరోగ్య కేంద్రంలో ఒక్క వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు విధులు నిర్వహిస్తున్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాలే కాకుండా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పలు విభాగాల్లో 45 మందికి పైగా వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలు, ఏఎస్‌వోలు, ల్యాబ్‌టెక్నీషియన్స్ డిప్యుటేషన్ రద్దు కావడంతో ఆ కేంద్రాల్లో సైతం వైద్య సేవలు అంతంత మాత్రంగా అందిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి పంపించాం

డాక్టర్ బి.వీరన్న, సూపరింటెండెంట్, గూడూరు, సీహెచ్‌సీ.

డిప్యుటేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు గతంలో వారు నియామకమైన స్థానాలకు తిరిగి పంపించాం. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, ఇతర విభాగాల సిబ్బంది అవసరం ఉంది. ఈ విషయమై కలెక్టర్‌కు వివరించాం.

## తోగులు, చెలమలే తాగునీటికి ఆధారం



ఏటూరునాగారం: వేసవి కాలం వచ్చింది. గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. జిల్లాలో మొత్తం గ్రామీణ మంచినీటి విభాగాన్ని ఏటూరునాగారం, ములుగు, గ్రిడ్ సబ్ డివిజన్‌లుగా విభజించి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 490 ఆవాసాలున్నాయి. పాతవి, కొత్తగా నిర్మించినవి 515 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులున్నాయి. ప్రతి ఆవాస గ్రామానికి తిరిగి తాగునీటి సరఫరాలో సమస్యల వివరాలు సేకరించారు. సమస్యలు గుర్తించిన చోట వాటర్ గ్రిడ్ నుంచి తాగు నీరు సరఫరా కాకపోతే గతంలో ఉన్న వనరుల నుంచి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఏటూరు నాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామ ప్రజలు ఏటా తాగునీటి సమస్య ఎదుర్కొంటూనే ఉన్నారు. కేవలం వేసవిలో మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో నాలుగు చేతి పంపులు పనిచేస్తున్నా తాగలేని పరిస్థితి. మిషన్ భగీరథ పైపు లైన్లు వేసినా వాగు పొంగిన ప్రతిసారీ పైపులు కొట్టుకుపోవడం, నీటి సరఫరా నిలిచిపోవడం జరుగుతోంది. సమీపంలోని జంపన్న వాగులోని నీటిని చెలమ తోడుకుని తాగేందుకు తీసుకెళుతున్నారు. తాళ్లగడ్డ, క్రాస్ రోడ్డు, ఆకులవారి గణపురం ప్రాంతాల్లో ఎత్తైన ప్రదేశాలకు కొన్ని సార్లు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడం లేదు. వారంలో రెండు రోజులు మాత్రమే నీరందుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రొయ్యూరులో సమస్య ఉండగా శంకరాజుపల్లిలోని ఓహెచ్ఎస్ఆర్‌కు అనుసంధానం చేశారు. అయినా ఇక్కట్లు మాత్రం యథాతథమే.

నీళ్ల డబ్బాలు కొనాల్సిన దైన్యం

జబ్బోనిగూడెం, శనిగకుంట, రాజుపేట గ్రామాల్లో వేసవి వచ్చిందంటే తాగు నీటికి కటకటే.. జబ్బోనిగూడెంలో మిషన్‌భగీరథ నీరు సరఫరా కాక వాటర్‌ట్యాంకు నిరుపయోగంగానే ఉంది. వేసవిలో గ్రామస్థులు గౌరారం వాగు, పంట పొలాల్లోని మోటార్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. శనిగకుంటలో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. రాజుపేటలో ముసలమ్మ వాగులో నీరు రాక గ్రామస్థులు మంచినీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. వేసవిలో తాగునీటి ఇబ్బందికర గ్రామాలను ఇంకా గుర్తించలేదని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆలేటి సుదర్శన్ తెలిపారు.

బోరు వేసినా తక్కువ నీరే...

ఆక తిరుమలరావు శనిగకుంట

గ్రామంలో బోర్లు వేస్తే నీరు పడటం లేదు. ఇటీవల 13.50 లక్షల నిధులు ఐటీడీఏ నుంచి మంజూరయ్యాయి. ఆ డబ్బుతో బోరు వేస్తే ఇంచున్నర నీరు పోస్తుంది. వేసవి వస్తే భూర్భజలాలు పూర్తిగా అడుగంటి చుక్కనీరు రాదు. గ్రామ సమీపంలోని తోగునుంచి నీరు తెచ్చుకుంటున్నాం.

వేసవిలో కటకటే...బండ్ల ఫణేంద్ర రాజుపేట

తాగడానికి వాటర్ ప్లాంట్ల వద్ద డబ్బాల నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. ఆ నీరు తాడగం వల్ల వంటి నొప్పులు, కీళ్లనొప్పుల సమస్యలు ఎక్కువవుతున్నాయి. 22 ఏళ్లుగా తాగునీటి సమస్య ఉంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి

భగీరథ నీటినందించాలి వట్టం మంజుల

ఎలిశెట్టిపల్లికి సరైన రవాణా వసతి లేదు. అత్యవసర వైద్యానికి ఎటూ పోలేని పరిస్థితి. కనీసం తాగు నీటి వసతి కూడా లేదు. మిషన్ భగీరథ ద్వారా రోజూ తాగునీరివ్వాలి. వాగులో చెలమ తీసుకుని తాగునీటిని తీసుకుపోవాల్సిన దుర్భర పరిస్థితి పోగొట్టాలి.

వాగు నీరే దిక్కు చెరుకుల స్వరూప

గ్రామం పక్కనున్న జంపన్నవాగు నీరు బురదగా ఉన్నా, చెలమ తోడి తాగేందుకు నీటిని తీసుకెళతాం. ఇతర తాగు నీటి వసతి ఏమీ లేదు. అధికారులు, ఐటీడీఏ పీవో స్పందించి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం వెంకట సతీష్, డీఈఈ, ఏటూరునాగారం సబ్ డివిజన్

ఈ వేసవి కాలంలో జిల్లాలోని ఏ ఒక్క ఆవాసంలోనూ తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి సమస్యలు గుర్తించి ఏఏ చర్యలు తీసుకోవాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. జిల్లాలోని అన్ని ఆవాసాల్లో పర్యటిస్తున్నాం. ఎక్కడైనా చిన్నపాటి మరమ్మతులుంటే తక్షణమే బాగుచేయిస్తాం. వాటర్ గ్రిడ్ల నుంచి సరఫరా అందకుంటే సమీపంలోని పాత నీటి వనరు నుంచి అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

లీకులతో తాగునీటి ఇక్కట్లు

వెంకటాపురం: వెంకటాపురం పట్టణంలో పైపులైన్ల లీకులతో తాగునీటి ఇక్కట్లు తలెత్తుతున్నాయి. ఇక్కడి పశువుల వైద్యశాల వద్ద మిషన్ భగీరథ నిధులతో ట్యాంకు నిర్మించినా నిరుపయోగంగానే ఉంది. పట్టణంలోని పూర్వపు ట్యాంకు ద్వారా సరఫరా చేస్తుండగా, కాలనీలకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతోంది. అటవీ గ్రామాలైన కొత్తగుంపు, కలిపాక, తిప్పాపురానికి రోజు మార్చి రోజు భగీరథ నీరు చేరుతోంది. వీఆర్‌కేపురం పంచాయతీలోని అనేక కాలనీలకు భగీరథ నీరు అందటం లేదు.

నెల రోజులుగా సమస్య పెనుమచ్చ మాధురి, రెండు పడకల ఇళ్ల సముదాయం, బీసీమగ్రిగూడెంనెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఇక్కడి 82 గృహాలకు సంబంధించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన బోరు నీటిపైనే ఆధారపడుతున్నాం. ఆ నీరు తాగి అనారోగ్యాలకు గురవుతున్నాం. ఎవరికి చెప్పినా స్పందించడం లేదు.

## వరిపొలం ఎర్రబారుతోంది..!

సూర్యాపేట : వాతావరణంలో వచ్చిన మార్పులు వరి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే ఒక వైపు భూగర్భ జలాలు అడుగంటి బోర్లు తగ్గుముఖం పట్టడంతో సాగు నీరు అందక పొలాలు ఎండుతున్నాయి. సాధారణంగా వానాకాలంతో పోలిస్తే యాసంగి వరి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండి చీడపీడల తీవ్రత, సాగులో సమస్యలు తక్కువగా ఉండి ధాన్యం దిగుబడులు అధికంగా వస్తాయి. ప్రస్తుత యాసంగిలో నాటు వేసిన పొలాలకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతోపాటు చలి తీవ్రత కారణంగా పొలం ఎదగకపోవడం, ముందుగా నాట్లు వేసిన చోట ఎర్రబారడం తదితర సమస్యలు కనిపిస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు మందులు పిచికారి చేసినా లాభం చేకూరడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పంట చేతికి వచ్చినా పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన పెట్టుబడిజిల్లాలో ఈ యాసంగిలో 3,24,546 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. పొలం ఎర్రబారితే నివారణ చర్యలు, సలహాలు, సూచనలు అందించడానికి క్లస్టర్ల వారీగా వ్యవసాయ అధికారులు లేరని రైతులు వాపోతున్నారు. పైరు ఎదగడానికి యూరియాను అధికంగా వేసిన చోట చీడపీడల తీవ్రత మరింతగా పెరిగింది. దెబ్బతిన్న పంట కర్రలను తీసుకెళ్లి దుకాణదారుడికి చూపిస్తే పురుగు, తెగుళ్ల మందుతోపాటుగా పోషకాలను కూడా కలిపి పిచికారీ చేయాలని రైతులకు అంటగడుతున్నారు. ఈ మూడింటితోనూ వరి పైరు పచ్చబడకుంటే మందులను మార్చి మరోసారి ఇస్తున్నారు. పలుచోట్ల గ్రామాల్లో గంట గుళికలు, బయోఉత్పత్తుల పేరిట అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. నాటిన పైరు కుదురుకుని పిలకలు వేయాల్సిన సమయమంతా కర్రలు నిలదొక్కుకునేందుకు గడచిపోతోంది. పిలకలు రాక దిగుబడులు తగ్గనుండగా సస్యరక్షణకు పెట్టుబడి వ్యయం నాలుగింతలు పెరిగిందని రైతులు వాపోతున్నారు. అధికారులు అప్రమత్తమై పంటలను కాపాడుకునేందుకు అవసరమైన మందులు రైతులకు తెలిపేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## రుణం.. పనితీరే ఆధారం

నల్గొండ : ప్రభుత్వపరంగా, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్న వారిలో సింహభాగం మహిళా సంఘాలే ఉంటున్నాయని చెప్పవచ్చు. బ్యాంకు అధికారులు సైతం ఈ పొదుపు సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తారంటే అతిశయోక్తి కాదు. ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రకరకాల ప్రయోగాలకు రూపకల్పన చేస్తోంది. ఆ క్రమంలోనే తాజాగా 'గ్రేడింగ్' విధానం తీసుకొచ్చింది. సంఘాలను మరింత పటిష్ఠం చేయాలన్న లక్ష్యంతో ఈ విధానం అమలు చేయనున్నారు.

కొలమానం ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 79,923 స్వయం సహాయక సంఘాలుండగా 8,21,943 మంది సభ్యులున్నారు. గ్రేడింగ్ విధానంలో మహిళా సంఘాలకు ఎనిమిది అంశాల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇవ్వనున్నారు. ఒక్కో సంఘం 75 శాతానికి పైగా లక్ష్యాలు సాధిస్తే 'ఏ' గ్రేడ్, 70 నుంచి 75కు 'బీ', 60 నుంచి 70కి 'సీ', 60 శాతం కంటే తక్కువ సాధిస్తే 'డీ', అంతకంటే దయనీయంగా ఉంటే 'ఈ' గ్రేడ్ గా నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు గ్రామైక్య సంఘాలకు



మాత్రమే గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఏ, బీ, సీ గ్రేడింగ్‌లో ఉన్న గ్రామైక్య సంఘాలకే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకూ ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పొందటం కష్టంగా మారనుంది. ఈ విషయాన్ని పసిగట్టే సంఘాల సభ్యులు అప్రమత్తమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

పెరగనున్న అధికారుల పర్యవేక్షణ

గ్రేడింగ్ విధానం అమలులోకి వచ్చిన కారణంగా మహిళా సంఘాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగనుంది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి అక్షాంక్ష, రేఖాంశాలతో కూడిన లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తరచూ సమావేశాల నిర్వహణతో రుణాల చెల్లింపులో వెనుకబడిన సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రేడింగ్‌లో ఎప్పుడూ ముందుండేలా సంఘాల వారీగా అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని సమీక్షలు నిర్వహించి కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎప్పుడూ ముందుండేలా సంఘ సభ్యుల్లో పోటీతత్వం అలవడి మరింత సక్రమంగా లావాదేవీల నిర్వహణ, పొదుపులు, అప్పులు చెల్లింపులకు అవకాశం ఉంటుంది.

నిర్దేశించిన అంశాలు..

ప్రతినెలా రెండు సార్లు సమావేశాలు నిర్వహించడం.
సమావేశాలకు పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కావాలి.
ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు చేయాలి.
క్రమంతప్పకుండా అంతర్గత రుణాల తిరిగి చెల్లింపు.
సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎస్ఎఫ్) అప్పు కట్టాలి.
స్త్రీనిధి రుణ వాయిదాలపై కూడా..
గ్రామ సంఘానికి సంబంధించి రుణ వాయిదాలు.
బ్యాంకు అప్పు తిరిగి చెల్లింపులు జరపాలి.

## సదరంగా దోచుకుంటున్నారు..!

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రస్తుతం నెలకు రూ.4,016 పింఛన్ ఇస్తోంది. కొద్ది రోజుల్లో ఆ మొత్తం పెంచడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దివ్యాంగుల ధ్రువపత్రాలకు గిరాకీ పెరిగింది. ఇటీవల కొందరు సకలాంగులు కూడా దివ్యాంగ పింఛన్ తీసుకోవడానికి తీవ్ర యత్నాలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు సదరం కార్యాలయం సిబ్బందితో చేతులు కలిపి రూ.30 వేల నుంచి రూ.35 వేలు తీసుకుంటూ 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న ధ్రువపత్రాలు ఇస్తున్నారు. దీంతో ప్రతి నెలా శిబిరాలు నిర్వహిస్తున్న సమయంలో కార్యాలయ సెక్యూరిటీ గార్డులు, కొందరు దివ్యాంగుల సంఘాల నాయకులతో పాటు మధ్య దళారులు సదరం కార్యాలయం వద్ద వరుస కడుతున్నారు.

5 శాతానికి పైగా..

జిల్లా జనాభాలో ఐదు శాతానికి మించి దివ్యాంగులు ఉన్నట్లు కార్యాలయంలోని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 16 లక్షల జనాభా ఉంటే 84,999 మంది వివిధ రకాల వైకల్య ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 54,242 మంది దివ్యాంగులుగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలో హైదరాబాద్ జనాభాలో ఒకటిన్నర శాతం మంది మాత్రమే దివ్యాంగులు ఉంటే అత్యధికంగా నల్గొండ జిల్లాలోనే ఉన్నట్లు గుర్తింపు పొందింది. ఇప్పటికీ ఇంకా వేలాది మంది దివ్యాంగుల దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు.

జిల్లా కేంద్రం సమీపంలోని అప్పాజిపేటకు చెందిన ఓ మహిళ ఈ నెల 3న ఆర్థో సమస్య(ఓహెచ్) ఉన్నట్లు మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. అదే రోజు సదరం శిబిరంలో మహిళకు వినికిడి సమస్య 53 శాతం ఉన్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. వాస్తవానికి ఆర్థో తేదీలో వినికిడి సమస్య వారికి ధ్రువపత్రాలు ఇవ్వరు. ఆ వైద్యుడికి తెలియకుండానే ఎలాంటి అనుమానం రాకుండా ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో గుర్తులు పెట్టి ధ్రువపత్రాలు జారీ చేశారు. అదే కుటుంబానికి చెందిన మరో ఇద్దరు మహిళలకు ఆరు నెలల క్రితం సదరం పత్రాలు జారీ చేశారు. అప్పాజీపేట గ్రామంలో పదికి పైగా నకిలీ పత్రాలు జారీ అయినట్లు సమాచారం.

చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఓ 70 ఏళ్ల వయస్సున్న వృద్ధుడితో పాటు మరో ఇద్దరికి అర్హత లేకున్నా నకిలీ పత్రాలు జారీ చేసినట్లు తెలిసింది. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు, నల్గొండ మండలంలో కంచనపల్లి, తిప్పర్తి మండలం పెద్ద సూరారం, కట్టంగూరు మండలంలో ఆరు, దేవరకొండ మండలంలో పదికి పైగా ధ్రువపత్రాలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

ఫిర్యాదు చేస్తే చర్యలు

డా.మాతృనాయక్, సదరం ఛైర్మన్, డీసీహెచ్‌ఎస్

సదరం ధ్రువపత్రాల పంపిణీలో పైరవీలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ చేసి వాస్తవాలు ఉంటే చర్యలు తీసుకుంటాం. నకిలీ పత్రాలు తీసుకున్న వారి సమాచారం ఇస్తే విచారణ చేసి కేసులు నమోదు చేయిస్తాం. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. మధ్య దళారులను నమ్మొద్దు.

విచారణ చేస్తున్నాం : డా.బెంజిమన్, ఈఎన్‌టీ

ఇటీవల నల్గొండ మండలం పరిధిలోని అప్పాజిపేటకు చెందిన ఓ మహిళకు తాము ధ్రువపత్రం ఇవ్వకుండానే ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇది ఎలా జరిగిందనే విషయంపై విచారణ చేస్తున్నాం. అవసరమైతే ఆ మహిళను మరోసారి పరీక్షలకు పిలిచి వాస్తవాలు పరిశీలిస్తాం. ఒకటి రెండు రోజుల్లో వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

హుజూరాబాద్ : హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 2020 ఆగస్టు లో రూ.60 లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. అప్పట్లో ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని గ్రంథాలయం ఎదుట, సైదాపూర్ ప్రధాన రహదారి, ఎంపీడీవో కార్యాలయం ఎదుట త్వరితగతిన పనులను ప్రారంభించి రెండు, మూడు నెలల వ్యవధిలో నిర్మించారు. వాటిని ప్రారంభించాలని నవంబర్‌లో మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానం చేశారు. కాగా గుత్తేదారు వాటిని ప్రారంభించకపోవడంతో 2021 ఏప్రిల్‌లో వాటిని తెరిచారు. మూడు నెలల్లోనే నిర్వాహకులు లేరంటూ తాళాలు వేశారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటిదాకా స్థానికులు, వాణిజ్య సముదాయ వాసులు, పట్టణానికి అవసరనిమిత్తం వచ్చేవారు నానా అవస్థలు పడుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ మున్నాళ్ల ముచ్చటే..

2022–23లో రూ.కోటిన్నర పైగా వెచ్చించి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఆధునీకరించారు. సెంట్రల్ లైటింగ్ విద్యుత్తు స్తంభాలకు చుట్టూ రంగు రంగుల చిన్న చిన్న బల్బులను ఏర్పాటు చేశారు. అదికాస్త మూణ్నాళ్ల ముచ్చటగానే పరిణమించింది. ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే సైదాపూర్, కరీంనగర్, జమ్మికుంట రోడ్డులో వెలుగులు లేకుండా పాడైపోయాయి. మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య మాట్లాడుతూ.. త్వరలోనే ఆయా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు టాయిలెట్ల మరమ్మతు పనులపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

జన సంచారం లేని చోట నిర్మాణం

జమ్మికుంట పుర పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రూ.లక్షలు




వెచ్చించి ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులను అన్ని హంగులతో నిర్మించారు. జమ్మికుంట బస్టాండ్ సమీపంలోని వాటర్ ట్యాంక్, నాయిని చెరువు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డు వద్ద, కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద రెండేళ్ల క్రితం నిర్మించారు. ప్రజా మరుగుదొడ్ల ముందు భాగాన దుకాణాలను నిర్వహిస్తుండటంతో అవి కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. స్థానిక ప్రజా పరిషత్తు కార్యాలయం ముందు, జన సంచారంలేని నాయిని చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్‌కు తాళం వేసి ఉంటుందని స్థానికులు అంటున్నారు. స్థానిక పుర పరిధి కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ల ప్రారంభోత్సవం అనంతరం తెరుచుకోలేదని కొత్తపల్లి వాసులు అంటున్నారు. జమ్మికుంటలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

# గైర్హాజరు కార్మికులపై నజర్

హుజూరాబాద్ : ముందస్తు సమాచారం లేకుండా వరుసగా అయిదారు రోజులు పనికి రాని పారిశుద్ధ్య కార్మికుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా విధులకు గైర్హాజర వుతున్న కార్మికుల జాబితా సిద్ధం చేసి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. నగరంలోని 66 డివిజన్ల వారీగా పనికి రాకుండా తప్పించుకుంటున్న కార్మికుల పేర్లను అధికారులు తీసుకున్నారు. పదిరోజుల క్రితం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ఇద్దరు ఒప్పంద కార్మికులపై వేటుపడింది. త్వరలోనే మరికొంత మందిని సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్న పురుష కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించారు.

లెక్కకు మించి..

గ్రేటర్ వరంగల్ పరిధిలో లెక్కకు మించి పారిశుద్ధ్య కార్మికులున్నారని అధికారుల పరిశీలనలో తేలింది. ఒప్పంద కార్మికులు 2500, తాత్కాలిక కార్మికులు 452 మంది పనిచేస్తున్నట్లుగా ప్రజారోగ్య విభాగం అధికారిక లెక్కలు చెబుతున్నాయి. డివిజన్లలో పారిశుద్ధ్య పనులకు కార్మికుల కొరత ఉందని ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు అంటున్నారు. చాలా డివిజన్లలో శానిటేషన్ పనులు సరిగా జరగడం లేదని ఫిర్యాదులు న్నాయి. పనిచేసే కార్మికులు ఎంత మంది?, విధులకు గైర్హాజరవుతున్న కార్మికులు ఎంతమంది ఉంటారో డివిజన్ల వారీగా లెక్కలు తీస్తున్నారు.



ప్రతిరోజూ 450–500 మంది కార్మికులు విధులకు రావడం లేదని తెలిసింది. బయోమెట్రిక్ అటెండెన్సు చూస్తే 100–150 మంది మాత్రమే గైర్హాజరవుతున్నట్లు చూపిస్తున్నారు. చాలామంది అటెండెన్సు వేసేసి ఇతర పనులకెళ్తున్నట్లుగా సమాచారం. పని చేయకుండా జీతాలు పొందుతున్న కార్మికుల నుంచి అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కొత్త నిబంధనలు ఇవే..!

ఒప్పంద, తాత్కాలిక కార్మికుల స్థానంలో బదిలీ కార్మికులను పనిలోకి తీసుకోవద్దు. బదిలీ కార్మికుల వివరాలు సేకరిస్తున్నారు.

బయోమెట్రిక్ అటెండెన్సు ఆధారంగా నెలవారీ జీతాలు చెల్లిస్తారు.

మాన్యువల్ రిజిస్టర్ పరిగణనలోకి తీసుకోరు.

నగరంలోని 66 డివిజన్లలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికుల వివరాలు రోజూ నివేదించాలి.

# సన్నద్ధత సమయం.. ప్రణాళికే కీలకం



పెద్దపల్లి : పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి.. ఏడాది పొడవునా చదివిన పాఠాలకు సరైన ఫలితం రావడానికి ఈ స్వల్ప కాలమే కీలకం.. విద్యార్థులు ఒత్తిడి, భయం లేకుండా ప్రణాళి కతో సన్నద్ధమైతే లక్ష్యాలను చేరుకోవడం కష్టమేమీ కాదు. ఇంటర్మీడి యట్, పదో తరగతి పరీక్షలు త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఆత్మవిశ్వాసమే ఇంధనం

విద్యార్థుల సానుకూల దృక్పథంతో సన్నద్ధమవ్వాలి. ఎంత కఠిన అంశమైనా సాధిస్తాననే నమ్మకంతో చదవాలి. ఎట్టి పరిస్థితిలో వెనుకబ డ్డామని భావించవద్దు. ప్రతి సబ్జెక్టుకు కచ్చితమైన ప్రణాళిక రూపొం దించుకొని సాధన చేయాలి. సమయ ప్రణాళికను పేపర్‌పై రాసుకొని గోడకు అంటించుకోవాలి. ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు చదవడం ద్వారా విషయం చాలా కాలం గుర్తుండిపోతుంది.

అంతర్లీన ప్రతిభను వెలికితీయాలి

తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవద్దు. వారిలో ఆత్మవిశ్వాసం నింపాలి. పొరపాటున కూడా తోటి విద్యార్థులతో పోల్చకూడదు. చదువుకోవడా నికి స్వేచ్ఛనివ్వాలి. పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసేం దుకు భరోసానివ్వాలి. ఇక తరగతి గదిలో ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి. పాఠ్యాంశాల్లో సందేహాలు నివృత్తి చేస్తూ, చదివేలా ప్రోత్సహించాలి.

బృంద చర్చలతో సత్ఫలితాలు

ఆయా సబ్జెక్టుల్లో కఠినమైన వ్యాసరూపంలో ఉండే జవాబులను చిన్న చిన్న అంశాలుగా విభజించుకోవడం మేలు. పాఠ్యాంశాలను బట్టీ పట్టకుండా అర్థం చేసుకొని సాధన చేస్తే కఠినమైన పదాలు, పాఠాలు గుర్తుంటాయి. ఆంగ్లం, గణితం, భౌతిక రసాయనశాస్త్రం సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని పునఃశ్చరణ చేసుకోవాలి. మోడల్ పేపర్లలో సందేహాలు అవగతం చేసుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. తరగతి గదిలో విద్యార్థుల బృంద చర్చలు మంచి ఫలితమిస్తాయి.

తల్లిదండ్రులదీ బాధ్యత

పాఠశాల నుంచి ఇంటికి రాగానే పిల్లలు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నా రు. చివరికి భోజనం చేసే సమయంలోనూ వదలడం లేదు. పరీక్షల సమయంలో ఇది మరింత ప్రమాదకరం. టీవీలకు అతుక్కుపోయి, సామాజిక మాధ్యమాల మోజులో పడి చదివింది మరచిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. పిల్లల ముందు తాము కూడా ఫోన్, టీవీ చూడటం మానేయాలి.

పోషకాహారంతో చురుకుదనం

విద్యార్థులు జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం లేదు. ఫలితంగా రక్త హీనత, అలసట బారిన పడుతున్నా రు. ఈ సమయంలో విద్యార్థులు పోషకాహారం తీసుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఉదయం, సాయంత్రం పాలు, కోడిగుడ్డు ఇవ్వాలి. పండ్లు, డ్రైఫ్రూట్స్ ద్వారా తక్షణ శక్తి లభిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విటమిన్ల మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

# అనుమతి రాక.. రహదారి పూర్తికాక



వేములవాడ : రెండు మండలాల్లోని ప్రజలకు రవాణా సుదుపాయం మెరుగుపర్చేందుకు మూడేళ్ల క్రితం నిధులు మంజూర య్యాయి. రెండు వైపులా రహదారి నిర్మాణం చేపట్టినప్పటికీ మధ్యలో అటవీశాఖ స్థలం ఉండటంతో నిలిచిపోయింది. ఫలితంగా రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం మండలానికి వెళ్లేందుకు ఏళ్లుగా రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అటవీ ప్రాంతంలో నుంచి ద్విచక్రవాహనాలపై ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాకాలంలో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. కనుచూపు మేరలో చేరుకొనే గ్రామాలకు రహదారి లేకపోవడంతో రుద్రంగి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. సుమారు 20 కిలో మీటర్లు అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా రహదారి నిర్మించాలన్న స్థానికుల డిమాండ్ మేరకు మూడేళ్ల కిందట ప్రభుత్వం రూ. 19.75 కోట్లు మంజూరు చేసింది. పది కిలోమీటర్ల రహదారిలో చందుర్తి నుంచి 5 కిలో మీటర్లు, భీమారం మండలం వైపు నుంచి కిలో మీట రున్నర రహదారి నిర్మాణం చేపట్టారు. మధ్యలో అటవీశాఖకు చెందిన 3.45 కిలో మీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అటవీ ప్రాంతంలో రహదారి వేయాలంటే ఆ శాఖ అనుమతి తప్పనిసరి కావడంతో పనులు ఆగిపోయాయి. రెండు వైపులా పూర్తయినప్పటికీ మధ్యలో అటవీప్రాంతంలో నిలిచిపోవడంతో ప్రజలకు కష్టాలు తీరలేదు. ఇది పూర్తయితే రెండు మండలాలకు బస్సు సదుపాయం అందుబాటులోకి రావడంతోపాటు దూరాభారం తగ్గుతుంది.

ప్రత్యామ్నాయంగా భూ కేటాయింపు

అటవీప్రాంతంలో రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉండటంతో ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు కోనరావుపేట మండలం కొండాపూర్‌లో సుమారు ఎనిమిది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. స్థల కేటాయింపు పూర్తి కావడంతో అనుమతులు రావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతులు మంజూరైతే పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి పూర్తికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

చొరవ తీసుకోవాలి చందుర్తి మండల కేంద్రం నుంచి భీమారం మండలం వైపు రహదారి నిర్మించకపోవడంతో ఏళ్లుగా ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో జాప్యం నెలకొంది. అటవీశాఖ అనుమతులు మంజూరయ్యే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. త్వరితగతిన రహదారి నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరిచాలి. విజయ్, స్థానికుడు

త్వరలోనే మంజూరు

రెండు వైపులా ఆరు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తయింది. మధ్యలో అటవీప్రాంతంలో 3.45 కిలో మీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలోనే అటవీశాఖ అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తాం. సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

# ఖాళీ స్థలాలకూ నివాసిత పన్ను


కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు ఇతర పురపాలి కల్లో ఖాళీ స్థలాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇళ్ల మధ్య, శివారు ప్రాంతాల్లో ఉన్న వీటికి ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)మదింపు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మూడేళ్ల కిందట పురపాలక శాఖ ఇంటినంబర్ల కేటాయింపును స్వీయ మదింపు విధానంలోకి తీసుకురావడంతో పలు ప్రాంతాల్లో నివాసిత ప్రాంతాలుగా మారిపోయాయి. క్షేత్రస్థాయిలో ఇంటి నంబర్లు కనిపించకపోగా కాగితాల్లో మాత్రం పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే తరహాలో పది రోజుల కిందట నగరానికి చెందిన ఒకరు అదనపు పాలనాధికారికి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడింది.

సర్వేలో గుర్తించినా.. చర్యలు శూన్యం

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు వేసుకోవడంతో సులువుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడా నికి అవకాశముండటంతో కొందరు ఇబ్బడిముబ్బడిగా తీసుకున్నారు. నగర స్థలాలతోపాటు విలీన కాలనీల్లోనూ ఈ విధానాన్ని అవలంబించారు. పురపాలక శాఖ ఏటా నిర్వహిస్తున్న భువన్ సర్వేలో ఖాళీ స్థలమని చూపించినా.. వాటిని సరిదిద్ది తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పాతికేళ్ల కిందట ఉ న్న స్థలాల్లో కూడా వీఎల్‌టీ వేయకుండా గోల్‌మాల్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

భూఆక్రమణలతో కదలిక

ఇటీవల పోలీసు అధికారులు భూఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి దస్త్రాలు పరిశీలిస్తుండటంతో ఇంటి సంఖ్యలు, అనుమతులు, ఆస్తిపన్ను చెల్లింపులు, రిజిస్ట్రేషన్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. విలీన కాలనీల్లో అయితే పాత తేదీలతో భవన అనుమతులు, ఇంటి నంబర్లు వేసుకున్న రసీదులు కూడా ఉ



ండటంతో వాటిపై పోలీసు, నగరపాలిక, రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

మూడు వేలకు పైగా...

ఖాళీ స్థలాలకు పన్ను మదింపు చేయడంతో నగర, పురపాలికలకు భారీ ఆదాయం సమకూరుతోంది. ఎల్ఆర్ఎస్ చేసే సమయంలో తప్ప మిగతా సమయాల్లో అవి ఉన్నట్లు గుర్తించడంలేదు. పన్ను మదింపు చేయడం ద్వారా పురపాలికల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే అవకాశముంటుంది. ఇలా ఆదాయం రాకపోగా డీజిల్ ఖర్చు చేసి, కార్మికులను నియమించి అందులో ఉన్న చెత్తాచెదారాన్ని బల్దియా సిబ్బందితోనే చేయిస్తున్నారు. ఒక్క నగరంలోనే సుమారు మూడు వేల ఖాళీ స్థలాలు ఉన్నట్లు పారిశుద్ధ్య విభాగం లెక్కలను బట్టి తెలుస్తోంది. వీటన్నింటికి వీఎల్‌టీ వేస్తే భారీగా ఆదాయం పెరిగే అవకాశముంటుంది.

# బక్కచిక్కిన బాల్యం

భూపాలపల్లి : ఆరోగ్యంగా ఉండాలంటే.. పోషక విలువల తో కూడిన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో అనేక రుగ్మతలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు బక్కచిక్కిపోతు న్నారు. పోషకాహార లోపం, తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు లేకపోవడం తదితర సమస్యలతో బాధపడుతున్న బాలలు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నట్లు అధికారుల గణాంకా లు తెలుపుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, చిరుతిండ్లు అందిస్తున్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా ఇంకా ఇలాంటి సమస్య ఉండటం ఆందోళనకరం.

వేల సంఖ్యలో..

తీవ్ర పోషకాహార లోపం, అతి తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు లేకపోవడం తదితర అనారోగ్య సమస్యలతో ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో చిన్నారులు బాధపడుతున్నారు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో అనారోగ్యం కలిగించే పలు రకాల వైరస్‌లు త్వరగా సోకే అవకాశం ఉంది. మంచి ఆహారంతోనే చిన్నారులు శారీరకంగా ఎదుగుతారని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సరిపడా బరువు ఉన్న పిల్లలు 1.62 లక్షల మంది ఉండగా, వయసుకు తగిన ఎత్తు 1.67 లక్షల మంది పిల్లలు, ఎత్తుకు తగిన బరువు ఉన్న పిల్లలు 1.84 లక్షల మంది ఉన్నారు.

పేదరికం, అవగాహన లేకపోవడం..



గ్రామీణ కుటుంబాల్లో ముఖ్యంగా పేదరికం, అవగాహన లేకపోవడం తో చిన్నారులకు పౌష్టికాహారం అందడంలేదు. వ్యవసాయ పనులు, కూలీకి వెళ్లేవారు పిల్లలను ఇంటి వద్ద వదిలేసి వెళ్తుండటంతో సరైన ఆహారం లేక ఆకలితో అలమటిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో అవగా హన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం


నాగేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి భూపాలపల్లి

పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తు న్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం స్థానంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు మరింత ఎక్కువ పోషక విలువలు గల బాలామృతం ప్లస్ అందించేలా చర్యలు తీసుకుం టున్నాం. ప్రతి నెలా గ్రోత్‌కార్డు ద్వారా తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు లేని చిన్నారులను గుర్తించి వారికి సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పోషక విలువలతో ఎలాంటి ఆహారం తీసుకోవాలో అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. తీవ్రమైన పోషకాహారలోపం ఉన్నవారికి వైద్య సేవలు అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

# నియోజకవర్గానికో ఆదర్శ రైతు వేదిక

జనగామ : వ్యవసాయ క్లస్టర్‌లలో నిర్మించిన రైతు వేదికలను దశల వారీగా వినియోగంలోకి తేనున్న క్రమంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రెండు నెలల కింద ప్రతి నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని ఆధునీకరించి దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా వ్యవసా య నిపుణుల సలహాలు సూచనలను ఇప్పించాలన్న నిర్ణయాన్ని మార్చు కుని జిల్లాకు ఒక కేంద్రాన్ని ఆధునీకరించాలని తలపెట్టింది. ఈ క్రమంలో కొడకండ్ల రైతు వేదికను గుర్తించి ఆధునిక పరికరాలు అమర్చింది. సంక్రాంతి నాడు ప్రారంభించాలనుకున్నా వాయిదా పడింది. తాజాగా మొదటి నిర్ణయం ప్రకారం నియోజకవర్గానికి ఒక కేంద్రానికి వైభవం కల్పించాలని నిర్ణయించి ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తరణాధికారులకు సమాచారమిచ్చింది.

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా ఉండడంతో ప్రభుత్వం వినియోగంలోకి తేవాలని యోచిస్తుంది. మొదట నియోజవర్గానికి ఒక కేంద్రాన్ని తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని చూస్తుంది. ఇంత కాలం ప్రతి మండలంలో క్లస్టర్లను గుర్తించి.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతుల చరవాణి ద్వారా విస్తరణాధికారులను సంప్రదిస్తే రైతుల పొలాలను సందర్శించి తెగుళ్లు, చీడపీడలను గుర్తించి వాటి నివారణకు తగు



సలహాలు ఇస్తున్నారు. ఊరికి దూరంగా వీటని నిర్మించడంతో రైతుల నుంచి సానుకూల స్పందన లేకపోవడం ప్రభుత్వం గమనించింది. ఇకనుంచి ప్రతి నియోజకవర్గంలో ఒక రైతు వేదికను గుర్తించి వివరాలివ్వాలని ప్రభుత్వం జిల్లా వ్యవసాయాధికారులను ఆదేశించింది. రైతులకు అందుబాటులో ఉండడం, విలువైన పరికరాలు అమరిస్తూ వాటికి రక్షణ తదితర ప్రమాణాలు, రైతులు తరచూ సందర్శిస్తున్న వేదికలను గుర్తించి పంపాలని సూచించడంతో అధికారులు వివరాలు పంపారు. వీటిలో దృశ్య శ్రవణ పద్ధతుల ద్వారా ఉన్నతాధికారులు, వివిధ పంటల గురించి అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలతో అతిథేయ ప్రసంగాలు ఇప్పిస్తారు.




తెలంగాణలో దీర్ఘకాలంగా వేధిస్తున్న భూసమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. లోపభూయిష్టంగా ఉన్న ధరణి స్థానంలో భూమాత పేరిట కొత్త పోర్టల్‌ను తీసుకొచ్చేందుకు రేవంత్ సర్కారు కసరత్తులు చేస్తోంది. భూ యజమానుల సమస్యల్ని పరిష్కరించేందుకు ఇప్పటికే కమిటీ వేసిన ప్రభుత్వం.. ఆ దిశగా ప్రత్యేక సమీక్షలూ నిర్వహిస్తోంది. ధరణి కమిటీ సూచనల మేరకు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి విధివిధానాలను రూపొందించాలని రెవిన్యూశాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.




ఢిల్లీ: ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధినేత నఫే సింగ్ రాథీను హతమార్చింది ఎవరు..? రాజకీయ ప్రత్యర్థులు మట్టుబెట్టారా..? లేదంటే రాథీ హత్యలో మాఫియా హస్తం ఉందా..? రాథీని హత్య చేయాల్సిన అవసరం గ్యాంగ్ స్టర్లకు ఉందా..? హత్య జరిగిన తీరుతో ఈ ప్రశ్నలు వస్తున్నాయి.

**బ్రిటన్ గ్యాంగ్ స్టర్..? :** నఫే సింగ్ రాథీ హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాథీ హత్యలో బ్రిటన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ పాత్ర ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో ఆ గ్యాంగ్ స్టర్ రాజకీయ నేతలను హతమార్చారని వివరిస్తున్నారు. ఢిల్లీలో కొన్ని నెలల క్రితం బీజేపీ నేతను మట్టుబెట్టారని పేర్కొన్నారు. ఆ గ్యాంగ్ స్టర్‌కు చెందిన సన్నిహితుడు ఒకడు తీహార్ జైలులో ఉన్నాడు. అతడిని ఈ రోజు హర్యానా పోలీసులు ప్రశ్నిస్తారని తెలిసింది. రాథీ హత్య కేసులో పోర్చుగల్‌లో ఉంటోన్న గ్యాంగ్ స్టర్ హిమాన్షు బావు ప్రమేయం ఉందని పోలీసులు సందేహిస్తున్నారు. జైలులో ఉన్న ఆ గ్యాంగ్ స్టర్ సభ్యులు రాథీని హత్య చేసేందుకు సుఫారీ తీసుకొని ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**లారెన్స్ బిష్ణోయ్, కాలా జాతేడి..? :** రాథీ హత్య కేసును విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హిమాన్షు బావు ప్రమేయంతో పాటు లారెన్స్ బిష్ణోయ్, కాలా జాతేడితో సన్నిహితంగా మెలిగే కొందరు షార్ప్ షూటర్లు పాల్గొని ఉంటారని ఢిల్లీ పోలీసులు భావిస్తున్నారు. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాల్లో గ్యాంగ్ స్టర్లు బిష్ణోయ్, జాతేడితో అనుచరులు దోపిడీ చేయడంతోపాటు హత్య చేసేందుకు కాంట్రాక్ట్ తీసుకుంటారు. రాథీ హత్య ఇదివరకు జరిగిన హత్యలతో పోలి ఉండటంతో పోలీసుల సందేహాలకు బలం చేకూరుతుంది. రాజ్‌పుత్ కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ హత్య జరిగినట్టే రాథీ హత్య జరిగింది.

**15 మంది పేర్లు :** రాథీ హత్య కేసులో వీరేంద్ర రాథీ, సందీప్ రాథీ, రాజ్‌పాల్ శర్మ సహా 15 మంది అనుమానితుల పేర్లను పోలీసులు చేర్చారు. మాజీ బీజేపీ ఎమ్మెల్యే నరేష్ కౌశిక్ కూడా ఉన్నారు. రాథీ హత్య జరిగిన ఝజ్జర్ ప్రాంతాన్ని కేసు విచారిస్తోన్న ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ సెల్ మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు.

## బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం రియాక్షన్ ఇదే..



సిద్దిపేట, ఫిబ్రవరి 27: అయోధ్య రాముడి జన్మంపై బీజేపీ ఎంపీ బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అయోధ్య రాముడి విషయంపై కాంగ్రెస్ నేతలపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని బండి స్పష్టం చేయగా.. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా స్పందిస్తూ బీజేపీ ఎంపీపై విరుచుకుపడ్డారు. బండి సంజయ్ రాజకీయ డ్రామాకు తెర లేపారని మండిపడ్డారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీగా ఏం చేశావో చెప్పి యాత్ర చేయాలని తాను అన్నట్లు తెలిపారు.

**తల్లిత ఎవరికేనా తల్లే...** " రాముడి జన్మంపై నేన్నడూ మాట్లాడలేదు. నేనని మాటను నాకు ఆపాదిస్తూ తల్లి జన్మపై మాట్లాడటం దుర్మార్గం. తల్లి ఎవరికైనా తల్లే.. అలాంటి మాటలు తప్పు.. మేమేవరం ఆయన యాత్రను అడ్డుకోవడం లేదు. బండి మాటలను మీరు సమర్థిస్తున్నారా అని నేను బీజేపీ అధ్యక్షుడిని అడుగుతున్న. కరీంనగర్ అభివృద్ధికి సంబంధించి బహిరంగ చర్చకు నేను సిద్ధం. ఓటమి భయంతోనే బండి ఇలాంటి మాటలు మాట్లాడుతూ రెచ్చగొడుతున్నారు. హిందూ గాల్లు బొందుగాల్లు అని కేసీఆర్ అన్న మాటలను ఎలా రాజకీయంగా వాడుకున్నవో, ఇప్పుడు అమ్మ గురించి నువ్వు మాట్లాడిన మాటల్తో నీ రాజకీయ జీవితం అంతరించిపోవడం ఖాయం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

**బండి ఏమన్నారంటే...** "అయోధ్యలో రాముడు జన్మించినట్లు గ్యారెంటీ ఏంటని మీరు ప్రశ్నిస్తే, నేను నా తల్లికి పుట్టినట్టు గ్యారెంటీ ఏంటి అంటే నువ్వెందుకు మీదేసుకుంటున్నావు. నన్ను అనవసరంగా గెలుకుతున్నారు, నేను శాంతియుతంగా ప్రజాహిత యాత్ర చేపడితే మీకేం వచ్చింది. ఎక్కడ నేను ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ విసురుతున్న.. నేను నా విశ్వాసాలతో రాముడు పేరిట ఎన్నికల్లో నిలుచుంటా, నువ్వు నీ వాదనతో నీ అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వ్యాపారం చేసుకుని బతుకుతా, మళ్ళీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. ఒకవేల నువ్వు ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా? పొన్నంతో రేవంత్ రెడ్డి జాగ్రత్తగా ఉండాలి. మొదటి నుంచి రేవంత్ రెడ్డిని వ్యతిరేకించిన వారిలో పొన్నం ఉన్నారు. ఇలాంటి అలజడులలో రేవంత్‌ను ఇరికించి ఆయన పదవీ కిందకి నీళ్ళు తేవచ్చు. బీఆర్ఎస్‌లలో కేటీఆర్, కాంగ్రెస్‌లో పొన్నంలు మోపైండ్లు. కేటీఆర్ వాగుడుతో బీఆర్ఎస్ మునిగింది.. పొన్నంతో కాంగ్రెస్ మునగడం ఖాయం" అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




## రూ. 500 గ్యాస్ కావాలంటే ఇవి ఉండాల్సిందే.. గైడ్‌లైన్స్ విడుదల చేసిన సర్కార్..

హైదరాబాద్, ఫిబ్రవరి 27: మహాలక్ష్మి పథకంలో భాగంగా మరో స్కీమ్ అమలుకు శ్రీకారం చుట్టింది తెలంగాణ సర్కార్. రూ. 500 గ్యాస్ సిలిండర్ స్కీమ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో రూ. 500 గ్యాస్ పథకానికి సంబంధించి గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఈ నిబంధనల ప్రకారం.. పథకం అమలు ఎలా చేస్తారు? ఎవరు ఈ పథకానికి అర్హులు? వంటి కీలక వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

- మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చే స్కీమ్‌కి సంబంధించిన జీవో జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం.
- సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం మూడు క్రైటీరియాలను ప్రకటించింది ప్రభుత్వం.
- సబ్సిడీ సిలిండర్ కోసం ప్రజాపాలనలో అప్లై చేసిన వారి లిస్ట్ ఆధారంగా 39.5 లక్షల లబ్ధిదారులను గుర్తించారు.
- ఈ పథకానికి అర్హులుగా తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం.
- మూడు సంవత్సరాల వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని.. దాని యావరేజ్ ఆధారంగా సంవత్సరానికి సిలిండర్స్ కేటాయిస్తారు.
- వినియోగదారులు తొలుత మొత్తం డబ్బు చెల్లించి సిలిండర్ తీసుకోవాలి.
- ఆ తరువాత వినియోగదారుల ఖాతాలోకి తిరిగి సబ్సిడీ అమౌంట్ జమ చేస్తారు.
- గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం నేరుగా %ాపీజ% సంస్థలకు ఇవ్వనుంది. సంస్థల నుంచి %ణదీ% ద్వారా వినియోగదారులకు నగదు చెల్లింపు చేస్తారు.
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని మానిటరింగ్ చేయనుంది ప్రభుత్వం.
- భవిష్యత్తులో వినియోగదారుల నుంచి కేవలం రూ. 500 చెల్లించేలా ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం.
- 48 గంటల్లోనే వినియోగదారుల అకౌంట్‌లోకి సబ్సిడీ అమౌంట్ ట్రాన్స్ఫర్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు.




హైదరాబాద్: అర్హులైనవారికి రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన 'మహాలక్ష్మి'లో మరో హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. రేషన్‌కార్డు ఉన్న వారికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో రేషన్‌కార్డు ఉన్న కుటుంబాల సంఖ్య 89.99 లక్షలుగా ఉంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తెల్లరేషన్‌కార్డు దారులకు రూ.500కే సిలిండర్ ఇవ్వనున్నారు. గ్యాస్ కంపెనీలకు నెలవారీగా సబ్సిడీ చెల్లిస్తామని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బును గ్యాస్ కంపెనీలు బదిలీ చేయనున్నాయి. మూడేళ్ల సరాసరి వినియోగం ఆధారంగా సిలిండర్లు ఇవ్వనున్నారు.

## హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్‌కు రాజధానిగా మారుస్తాం..



హైదరాబాద్: తెలంగాణలో మూడు చోట్ల ఫార్మా విలేజెస్ ఏర్పాటు చేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హెచ్ఐసీసీలో బయో ఆసియా-2024 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు చోట్ల ఫార్మా విలేజెస్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. దావోస్ వేదికగా 40 వేల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు తీసుకొచ్చామన్నారు. జినోమ్ వ్యాలీ ఫేజ్-2ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మీ కలలను సాకారం చేసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్‌కు రాజధానిగా మారుస్తామన్నారు. ఫార్మా ఉత్పత్తుల్లో 1/3 హైదరాబాద్ నుంచే వస్తున్నాయన్నారు. ఫార్మా రంగానికి హైదరాబాద్ ప్రపంచ వేదికగా ఉందని.. ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రేవంత్ తెలిపారు. ఫార్మా విలేజ్‌లకు రూపకల్పన చేశామన్నారు. కరోనా ఎన్నో ఇబ్బందులను సృష్టించిందన్నారు. ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉత్పత్తి అయిన కరోనా టీకాలు ప్రపంచ వ్యాప్తంగా సరాఫరా అయ్యాయన్నారు. ఫార్మా రంగానికి చెందిన ప్రతినిధులతో ఇటీవలే సమావేశమయ్యానన్నారు. ఎలాంటి సమయంలోనైనా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతున్న ఫార్మా రంగ ప్రతినిధులకు రేవంత్ అభినందనలు తెలిపారు.

## పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం..



హైదరాబాద్ : ప్రతిష్టాత్మక 21వ బయో ఆసియా సదస్సుకు హైదరాబాద్ వేదిక అయిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ఐసీపీలో బయో ఆసియా-2024 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు 40వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొత్త ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమన్నారు. పారిశ్రామికవేతలకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్త జీవ వైద్య విధానాన్ని అందుబాటులోకి తీసుకోస్తామని చెప్పారు. కేవలం పరిశ్రమల స్థాపనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఉద్యోగాల కల్పన చేసే విధంగా పాలసీ రూపొందిస్తామన్నారు. రాష్ట్రాన్ని నైపుణ్య శిక్షణ కేంద్రంగా మార్చేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేలా తగిన శిక్షణ ఇచ్చేలా విధానం రూపొందిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

## 71 మంది ఎస్ఐల బదిలీ.. ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా..




హైదరాబాద్ : 71 మంది ఎస్ఐలను, ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్ఓ వై.ప్రకాషరెడ్డిని మల్టీజోన్2కు, మారేడుపల్లి ఎస్‌హెచ్ఓ డి.శ్రీనివాస రావును ఎస్‌బీకి అటాచ్ చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660